# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్మిక శాఖతో సహా పలు ప్రభుత్వ శాఖలపై ఈరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు.**

**2. మెగా డీఎస్సీని ఈనెలలోనే ప్రకటిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శాసన మండలిలో వెల్లడించారు.**

**3. సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఆ శాఖ మంత్రి డోలా శ్రీ బాలా వీరాంజనేయ స్వామి తెలిపారు.**

**4. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పి.రాజశేఖరం విజయం సాధించారు.**

**5. చేనేత కార్మికులకు ఆర్థిక చేయూత అందించేందుకు ప్రతినెల ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నామని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత శాసన మండలిలో పేర్కొన్నారు.**

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి ఈరోజు పలు ప్రభుత్వ శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈరోజు శాసనసభ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం కార్మిక శాఖపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. కాగా ఈ మధ్యాహ్నం గనుల శాఖపై సమీక్ష నిర్వహిస్తారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొననున్నారు.

---------------------------

మెగా డీఎస్సీని ఈనెలలో ప్రకటిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఈరోజు శాసన సభ సమావేశాల్లో భాగంగా శాసన మండలిలో సభ్యులడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. యువత ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌ను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని మంత్రి తెలియజేస్తూ...

..వాయిస్.. 33 సెకన్లు

---------------------------

సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులకు 57 కోట్ల 66 లక్షల రూపాయల నిధులను విడుదల చేశామని

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శాసన సభ సమావేశాల్లో భాగంగా శాసన మండలిలో సభ్యులడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తున్నామని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు సన్నబియ్యంతో కూడిన భోజనాన్ని అందించనున్నామని మంత్రి తెలియజేస్తూ..

..వాయిస్.. 34 సెకన్లు

---------------------------

దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చేందుకు 100 రోజుల క్షయ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2024వ సంవత్సరం డిసెంబరు 7 నుంచి ఈ ఏడాది మార్చి 16వ తేదీ వరకు నిర్వహించే వంద రోజుల ప్రచారంలో అనేక కార్యక్రమాలను చేపడుతోంది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 347 జిల్లాల్లో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఈనెల 8వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి సందర్శించి అక్కడి పనులను పరిశీలిస్తారని తెలియజేశారు. అలాగే కాల్వల తవ్వకం, నిర్వాసితుల పరిహారంపై అధికారులతో చంద్రబాబు నాయుడు సమీక్షిస్తారని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి పిడిఎఫ్‌కు చెందిన కేఎస్ లక్ష్మణరావుపై 82 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రాజేంద్రప్రసాద్‌కు 2 లక్షల 41 వేల 7 వందల 74 ఓట్లు రాగా లక్ష్మణరావుకు లక్ష 45 వేల 57 ఓట్లు పోలయ్యాయి. ఈ సందర్భంగా గుంటూరులో ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ …22 సెకన్లు

కాగా.. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పి. రాజశేఖరం విజయం సాధించారని అధికారులు తెలిపారు.

---------------------------

ఈ రోజు ప్రపంచ స్థూలకాయ అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా అధిక బరువుతో బాధపడే సమస్యనే ఊబకాయం అంటారు. సరైన ఆహార నియమాలు పాటించక పోవడం …., వ్యాయామం చేయక పోవడం …., నిద్ర లేమి …, మానసిక సమస్యలు వంటి వన్నీ స్థూల కాయానికి ప్రధాన

కారణాలు. సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఊబకాయాన్ని తగ్గించుకోవచ్చని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత నెల మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావిస్తూ....

..వాయిస్... 20 సెకన్లు

---------------------------

చేనేత కార్మికులకు ఆర్థిక చేయూత అందించేందుకు ప్రతినెల ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నామని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. శాసన సభ సమావేశాల్లో భాగంగా ఈరోజు శాసన మండలిలో సభ్యులడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. చేనేత రంగ ప్రోత్సాహనికి అనేక క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నేత కార్మికులకు ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఆర్థిక సాయం అందిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..35 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షల హాల్ టికెట్లను వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగదు చెల్లించలేదని ప్రైవేటు పాఠశాలలు హాల్ టికెట్లు నిలిపివేయకుండా ఉండేందుకు వీలుగా ఈ వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. వాట్సాప్ నంబర్ 9 5 5 2 3 0 0 0 0 9కి హాయ్ అని సంక్షిప్త సందేశం పంపడం ద్వారా వచ్చే సేవలను ఎంచుకుని హాల్ టికెట్‌ను పొందవచ్చని సూచించారు. అలాగే ఆయా పాఠశాల లాగిన్‌లలోనూ హాల్ టికెట్లను అందుబాటులో ఉంచామని తెలిపారు.

======================